క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): చెన్నాపూర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సర్పంచ్ భారతి, ఉప సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పారిశుద్ధ్య గ్రామ క్రమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్మికులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న నవనీతరవి

మనోహరాబాద్(తూప్రాన్): గ్రామాల అభివృద్ధే లక్ష్యమని ఎంపీపీ పురం నవనీతరవి అన్నారు. శనివారం మనోహరాబాద్ మండల పరిషత్ కార్యాలయం వద్ద దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరిపాలన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఏ ప్రభుత్వం కూడా పెట్టిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, ఎంపీఓ లక్ష్మి నర్సయ్య, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ మునావర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమ్మేళనానికి మాజీ ఎమ్మెల్యే హాజరు



మేధావుల సభలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

మెదక్‌జోన్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం జరిగిన రాష్ట్ర మేధావుల కాంగ్రెస్ సమ్మేళనానికి మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి ఏఐసీసీ కార్యదర్శి మాణిక్యరావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మేధావుల సంఘం అధ్యక్షుడు అనంతుల షామోహన్, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీ ఎమ్మెల్సీ కమలాకర్ రావు, రాష్ట్ర విద్యా సంస్థల అధినేత ఆర్ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుపరిపాలన దినోత్సవం



నిజాంపేటలో సుపరిపాలన దినోత్సవంలో నాయకులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో ఎంపీపీ సిద్ద రాములు ఆధ్వర్యంలో సుపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చిన్న గ్రామ పంచాయతీలకు కృషి చేసిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డికి ఎళ్ల వేళలా రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీటీసీలు బాల్ రెడ్డి, సురేష్, కిష్టారెడ్డి, రెడ్డిశెట్టి రవీందర్, నాయిని మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారని ఆందోళన



హల్దీ వాగు వద్ద బైఠాయించిన బీజేపీ నాయకులు

కొల్చారం(నర్సాపూర్): హల్దీ వాగునుంచి ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారంటూ బీజేపీ నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వాల్ దాస్ మల్లేశంగౌడ్ ఆరోపించారు. శనివారం రాత్రి నాయకులు, కార్యకర్తలతో నదివద్ద బైఠాయించారు. అధికారులు హల్దీ వాగు నుంచి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని మల్లేశం గౌడ్ హెచ్చరించారు. మండల అధ్యక్షుడు దయాకర్ గౌడ్, ఏగొండ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

రామాయంపేట(మెదక్): రామాయంపేట రెవెన్యూ డివిజన్ విషయమై మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన హామీని నెరవేర్చాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ మంజూరు విషయమై ప్రభుత్వం పట్టణ ప్రజలను మోసగించిందని ఆరోపించారు.

ఇరుకు గదుల్లో చదువులు

- రేపటి నుంచి పాఠశాలలు ప్రారంభం
- సమస్యలతోనే కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం
- సరిపడా ఉపాధ్యాయులు లేరు
- ముందుకు సాగని 'మన ఊరు–మన బడి'



శిథిలావస్థలో గడిపెద్దాపూర్ జెడ్పీ పాఠశాల

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యాకోసం, సకల సౌకర్యాలు ఏర్పాటు చేయడమే కాకుండా, మన ఊరు–మన బడితో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అధికారులు, నేతలు నిత్యం చెబుతున్న మాటలు ఇవీ. వాస్తవంగా పరిశీలిస్తే పాఠశాలలో పేద విద్యార్థులు చదవలేని దుస్థితి నెలకొంది. పలు సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేకపోవడంతో పదోతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని తరగతి గదులు, శిథిల భవనాలమధ్య విద్యార్థుల చదువులు కొనసాగనున్నాయి.

కొన్ని పాఠశాలల్లో నేటికి చెట్ల కిందనే విద్యాబోధన సాగుతుందంటే నమ్మశక్యంగా లేదు.

మన ఊరు–మన బడితో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ

పనులు ముందుకు సాగడం లేదు. ఈ పనులు చేసిన చైర్మన్‌లు, కాంట్రాక్టర్లు అప్పుల పాలయ్యారు. ఇది అల్లాదుర్గం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితి. సోమవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాత సమస్యలతోనే స్వాగతం పలకాల్సి వస్తుంది.

➡ అల్లాదుర్గం మండలంలో 22 ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత, 5 జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. 22 ప్రాథమిక పాఠశాలలో 16 పాఠశాలలకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడుతో కొనసాగిస్తున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏడు తరగతులకు ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయులతోనే బోధన సాగిస్తున్నారు.

➡ జిల్లా పరిషత్ పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక విద్యాబోధన కుంటుపడుతుంది. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం కొనసాగుతున్న తెలుగు మీడియం ఉపాధ్యాయులే ఇంగ్లీష్‌లో బోధిస్తున్నారు. చిల్వెర జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం పోస్టుతో పాటు ఫిజిక్స్, అల్లాదుర్గం బాలుర జెడ్పీ పాఠశాలలో ఇంగ్లీష్, సోషల్, అల్లాదుర్గం

బాలికల పాఠశాలలో ఇంగ్లీష్, ముస్లాపూర్ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్, గడిపెద్దాపూర్ జెడ్పీ పాఠశాలలో మ్యాథ్స్, ఇంగ్లీష్, ఫిజిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సబ్జెక్టులను బోధించేవారు లేక పదోతరగతి విద్యార్థులు చదువుల్లో వెనుకబడుతున్నారు.

శిథిల భవనాల మధ్యే బోధన

గడిపెద్దాపూర్ జెడ్పీ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ భవనంలోనే విద్యార్థులు భయం..భయంగా చదువుకోవల్సిన దుస్థితి నెలకొంది.

50 ఏళ్ల క్రితం నిర్మించిన రేకుల భవనంలోనే నేటికి విద్యాబోధన కొనసాగుతుంది. ఈ పాఠశాల అభివృద్ధికి 'మన ఊరు–మన బడి' కింద రూ.80లక్షల రూపాయలు మంజూరు చేస్తే పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాక పోవడంతో పనులు నిలిచి పోయాయి. టెండర్లు వేసినా ఎవరు కూడా వేయక పోవడం గమనార్హం.

➡ చిల్వెర జెడ్పీ పాఠశాలలో సరిపడ తరగతి గదులు లేక వరండాలో, చెట్ల కింద విద్యాబోధన చేయాల్సి వస్తుంది. వర్షం పడితే బురదమయంగా మారడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడుతున్నారు. అల్లాదుర్గం బాలికల పాఠశాలలో సహితం తరగతి గదుల కొరత వేధిస్తుంది. ముస్లాపూర్ పాఠశాల భవనం వర్షం పడితే తరగతి గదులు కురుస్తుండటంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. వెంకట్‌రావ్‌పేట, అప్పాజీపల్లి, రాంపూర్, ముప్పారం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత తీవ్రంగా వేధిస్తుంది.

➡ మండలంలో ప్రాథమిక విద్యా పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు ఉండరు. ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థుల సంఖ్య ఉండని దుస్థితి

దాపురించింది. పల్లేగడ్డ (కుసంబినగర్) పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు ఉంటే ఇక్కడ ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. నీలకంటిపల్లి, సీతానగర్ తండా, చౌటాక తండా పాఠశాలలో విద్యార్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారు.



చిల్వెర జెడ్పీ పాఠశాలలో వరండాలో.. (ఫైల్)

➡ శాస్త్రీయ విద్యకు సహితం దూరమవుతున్నారు. సైన్స్ ల్యాబ్‌లు లేక శాస్త్రీయ విద్యా బోధన సాగడం లేదు. ముస్లాపూర్ పాఠశాలలో రూ.9 లక్షల రూపాయలతో సైన్స్ ల్యాబ్ నిర్మిస్తే పరికరాలు లేక ల్యాబ్ గదిని కార్యాలయం గదిగా మార్చుకున్నారు ఉపాధ్యాయులు. ల్యాబ్ కోసం నిర్మిస్తే కార్యాలయానికి వాడుకోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మూలన పడ్డ కంప్యూటర్లు అల్లాదుర్గం బాలికల, గడిపెద్దాపూర్, ముస్లాపూర్ జెడ్పీ పాఠశాలలో సక్సెస్ పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఇందులో 6 నుంచి10 తరగతులకు ప్రత్యేక ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారు. అందులో భాగంగా కంప్యూటర్ విద్యనందించేందుకు కంప్యూటర్లు సరఫరా చేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. కొన్నేళ్లు విద్యాబోధన సక్రమంగానే సాగింది. ప్రస్తుతం ఇవి మూలనపడ్డాయి. బోధించే వారు లేక కంప్యూటర్లు గదుల్లోనే మూలుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలలో తక్షణమే సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దివ్యాంగులకు పెన్షన్ పెంపుపై హర్షం



మనోహరాబాద్ కాళ్లకల్‌లో పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మందకృష్ణ పోరాట ఫలితమే దివ్యాంగులకు ప్రభుత్వం పింఛన్ పెంపుదల చేసిందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మాసాయిపేట్ యాదగిరి మాదిగ అన్నారు. కాళ్లకల్‌లో గ్రామ అధ్యక్షుడు వర్గంటి మురళి మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సుధాకర్, గ్రామ ఉపాధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శిలు అశోక్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల పరిషత్ ఆవరణలో దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మందక్రిష్ణామాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సంఘం అధ్యక్షుడు తుమ్మ శంకర్, దేవరాజ్, దత్తు, విఠల్, కృష్ణ, భూమయ్య, పాల్గొన్నారు.

మెదక్‌జోన్: దివ్యాంగులకు సీఎంకేసీఆర్ రూ.వెయ్యి పెంచడం హర్షించదగ్గ విషయమని, ఈ క్రెడిట్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకే దక్కుతుందని, వీహెచ్‌పీ రాష్ట్రనాయకుడు బాచ్‌పల్లి పాండు పేర్కొన్నారు. శనివారం మెదక్ పట్టణంలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూమయ్య, శీను, సుధాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు బాలరాజు, ప్రవీణ్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.



మెదక్ మున్సిపాలిటీ: పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మెదక్ మున్సిపాలిటీ: మందకృష్ణ మాదిగ కృషి ఫలితంగానే వికలాంగులకు పింఛన్ పెంచారని ఎమ్మార్పీఎస్ నాయకుడు బాల్‌రాజ్ పేర్కొన్నాడు. మెదక్ పట్టణంలో మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు పాండు, భూమయ్య, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నల్లపోచమ్మ ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ఎమ్మెల్యే మదన్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నర్సాపూర్ రూరల్: తుజాల్ పూర్‌లో కొనసాగుతున్న నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠలో శనివారం వేరువేరుగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి, విగ్రహాల దాత పటన్ చెరువు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు నీలంమధు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగ్గురికి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని బండరావిరాల గ్రామంలో రూ. 5లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం ఎంపీటీసీ దంతూరి అనితామహేందర్‌గౌడ్, సర్పంచ్ కవాడి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, వార్డు సభ్యులు నాగేష్, అరుణ్‌కుమార్ గౌడ్, శివ శంకర్, రాజేష్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలో గంగారం గ్రామానికి చెందిన నీరుడి రాములు మృతి చెందాడనే విషయం తెలుసుకొని మృతుని కుమారుడు మచ్చేందర్‌కు అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు రూ.7.7వేలు సాయం చేశారు. సతీష్, ప్రభాకర్, శ్రీనివాస్, నాగరాజు, రవి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తి శివునూర్ గ్రామంలో చింతల సంజీవులు మృతి చెందగా, మృతుని కుటుంబాన్ని శనివారం సర్పంచ్ షేక్ షరీఫ్, మైనంపల్లి సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ప్రతినిధి షేక్ రుక్మొద్దీన్ పరామర్శించారు. వారు అంత్యక్రియల నిమిత్తం రూ.5వేలు మృతుని కుటుంబానికి అందజేశారు. గంగయ్య, శంకర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



రామాయంపేట: మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్

సంక్షిప్త వార్తలు

◆ **నేడు కవి సమ్మేళనం**

మెదక్ కలెక్టరేట్: పట్టణంలో కవి సమ్మేళనం నిర్వహిస్తారని కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు కొల్చారంలోని మల్లినాథ సూరి విగ్రహానికి పూలమాలతో సాహిత్య నీరాజనం ఉంటుందన్నారు. అనంతరం 4 గంటలకు స్థానిక సాయి బాలాజీ గార్డెన్ ప్రక్కన గల హ్యాపీ మూమెంట్ బాంకెట్ హాల్‌లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

కొల్చారం(నర్సాపూర్): నేడు కొల్చారంలోని మల్లినాథ సూరి విగ్రహానికి పూలమాలతో సాహిత్య నీరాజనం ఉంటుందని కలెక్టర్ రాజర్షిషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ **ముగిసిన యాదగిరి అంత్యక్రియలు**

చిన్నశంకరంపేట(మెదక్): సూరారం గ్రామంలో ఉద్రిక్తత ఆందోళన నెలకొన్న పరిస్థితిని గ్రామ పెద్దలతో పాటు పోలీసుల దౌత్యంతో యాదగిరి అంత్యక్రియలు శనివారం ముగిశాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు శవాన్ని హత్యకు కారణమైన వారి ఇంటి వద్ద ఉంచుతామని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. పాత కక్షలతో దాడికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన యాదగిరి అంత్యక్రియలు బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం జరిగే వరకు నిర్వహించబోమని ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసుల సూచనతో గ్రామపెద్దలు జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా దాడికి పాల్పడిన కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించారు.

◆ **అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యపరీక్షలు**

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. దేవులపల్లిలో ఏఎన్ఎం శోభారాణి, మహ్మద్‌నగర్‌గేట్ తండాలో ఏఎన్ఎంలు రాజమణి, మజీదాబేగం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ శశికళ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమేష్ తనిఖీ చేశారు. అంగన్‌వాడీ టీచర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

◆ **12న ఎల్లమ్మ ఆలయంలో వేలం**

హుస్నాబాద్: పట్టణంలో ఎల్లమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి వచ్చిన వస్తువుల అమ్మకాలపై ఈ నెల 12న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి విశ్వనాథశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి వచ్చిన మిశ్రమ బియ్యం, ఎండు కుడుకలు, పోకలు, ఖర్జూరలు, పసుపు కొమ్ముల అమ్మకాలపై బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ **ప్రత్యేక పూజలు**

చేగుంట(తూప్రాన్): కిష్టాపూర్ గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ శనివారం నిర్వహించారు. విగ్రహ మూర్తులను ధాన్యాదివాసంలో ఉంచి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హోమం, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు శ్రీధరాచార్యులు ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు బాల్‌రెడ్డి, రాజగోపాల్ పాల్గొన్నారు.

◆ **12న మండల సర్వసభ్య సమావేశం**

కొల్చారం(నర్సాపూర్): మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గణేష్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ మంజుల అధ్యక్షత న సమావేశం ఉంటుందని తెలిపారు.



కోర్టు తీర్పు కాపీని అందచేస్తున్న జడ్జి అనిత

పంతాలకు పోకుండా రాజీమార్గం ఉత్తమం

జూనియర్ సివిల్ జడ్జి అనిత

నర్సాపూర్: కక్షిదారులు పంతాలకు పోకుండా కోర్టు చుట్టు తిరిగి తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని, ఇరువర్గాల రాజీ మార్గమే ఉత్తమం అని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత చెప్పారు. శనివారం స్థానిక కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేర జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో రాజీ పడిన అనంతరం పైకోర్టుకు వెళ్లే అవకాశం ఉండదన్నారు. 2001కి సంబంధించి సివిల్ కేసులో కక్షిదారులు రాజీ పడడంతో లోక్ అదాలత్‌లో అవార్డును పాస్ చేసి పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. లోక్ అదాలత్‌లో పలువురు ఎస్ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కంఠారెడ్డి తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలు



చిన్నశంకరంపేటలో కేక్‌కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నిజాంపేట: కాంగ్రెస్ కార్యకర్తలతో కంఠారెడ్డి తిరుపతి రెడ్డి జన్మదిన వేడుకలు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలో శనివారం బీరప్ప ఆలయం వద్ద కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి జన్మదిన వేడుకలను మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, ఉపాధ్యక్షుడు జిట్టి మారుతి, పట్టణ అధ్యక్షుడు నసిరుద్దీన్, మధుసూదన్ రెడ్డి, చింతల స్వామి, ముత్యాల మధుసూదన్ రెడ్డి, ఆకుల బాలయ్య, రామావత్ వినోద్, సులేమాన్, నరేందర్, సామల మహేష్, జాల రవి, భూమాగౌడ్, కాకి రాజయ్య, చింతల స్వామి, సిద్ద రాములు, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, బోయిని చంద్రం, నారా గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పుట్టిన రోజు వేడుకలను చిన్నశంకరంపేటలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు పోతరాజ్ రమణ భారీ బైక్ ర్యాలీ నిర్వహించి కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం బస్‌స్టాండ్ చౌరస్తాలో గజమాలతో ఆయన్ను సత్కరించి కేక్‌కట్‌చేశారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పల్లె రామ్‌చందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉదయ్ పాల్గొన్నారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి గేట్ వద్ద నిర్వహించారు. మొదట ఆయన కాంగ్రెస్ కార్యకర్తలతో ఏడుపాయలతో



రామాయంపేటలో కేక్‌కట్ చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు

వెళ్లి దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగ్సాన్‌పల్లి కమాన్ వద్ద కేక్ కట్ చేసి కార్యకర్తల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. జిల్లా కాంగ్రెస్ రైతు అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మండలశాఖ అధ్యక్షుడు గోవింద్ నాయక్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం రామాయంపేటలో కేక్ కట్ చేసి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్యాం రెడ్డి, పట్టణాధ్యక్షుడు చింతల యాదగిరి, మున్సిపల్ కౌన్సిలర్ అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి బైరాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

18న రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

పెద్దశంకరంపేట(మెదక్): ఈ నెల 18న కాంగ్రెస్ నిర్వహించనున్న రాజీవ్ గాంధీ ఆన్ లైన్ క్విజ్ పోటీలు యువత కోసమేనని టీపీసీసీ సభ్యుడు, ప్రోటోకాల్ సెక్రెటరీ కర్నె శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆన్‌లైన్ క్విజ్‌కు సంబంధించిన కరపత్రాలను కొత్తపేట్, కట్టెల వెంకటాపూర్ గ్రామాలలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత భారత ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాలు, విలువలను ప్రచారం చేసేందుకు, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొలిపేందుకే ఈ పోటీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అంజిరెడ్డి, భానుచందర్, నాయకులు జహంగీర్, గడ్డం సాయిలు, విజయ్, సంగమేశ్వర్, సుదర్శన్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కడ్తాల్: మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాల 2000 – 2001 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు మైసిగండి మైసమ్మ ఆలయ సమీపంలోని ఓ రిసార్ట్‌లో కలిశారు. 23 ఏళ్ల తర్వాత మిత్రులందరూ ఒక చోట చేరి ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమ తమ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న వృత్తి, ఉద్యోగ వివరాలను, కుటుంబ నేపథ్యాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. నృత్యాలు చేస్తూ, పాటలు పాడి ఆనందోత్సవాలతో ఆత్మీయ సమ్మేళన వేడుక నిర్వహించారు. ఆపదలో ఉన్న చిన్ననాటి మిత్రులకు సహాయం అందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజేందర్ యాదవ్, విజయ్, ప్రవీణ్, బీక్యానాయక్, సందీప్, పాండు, మల్లేష్, రాజు, సుజాత, లావణ్య, మమత, పవిత్ర, సరిత, శిల్పలత, స్వప్న, రాజేశ్వరి, హాజీబేగం, పుష్పలత, నరేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

బడంగ్‌పేట్: బడంగ్‌పేట అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు మంత్రి సబితారెడ్డి స్పష్టం చేశారు. శనివారం అల్మాస్‌గూడ పరిధిలోని పలు డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని బడంగ్‌పేట, మీర్‌పేట్, జల్‌పల్లి ప్రాంతాల్లోని పది చెరువులను రూ. 40 కోట్లతో సుందరీకరిస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చొరవతో నియోజకవర్గానికి వందల కోట్లు నిధులు వస్తున్నట్లు వివరించారు. బడంగ్‌పేటను జిల్లాలోనే ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దే బాధ్యత బీఆర్ఎస్‌దే అన్నారు. కార్పొరేషన్లను అభివృద్ధికి చిరునామాగా తీర్చి దిద్దుతున్న సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, కార్పొరేటర్లు ఎస్ స్వప్న, ఆర్ కవిత, ఏ రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జే పద్మ, ఆర్ మాధురి, బీ దీపిక, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆర్ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎస్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.